క్లుప్తంగా

నేడు సహస్ర దీపాలంకరణ మహోత్సవం

వల్లూరు : మండలంలోని గంగాయపల్లెలో వెలసిన శ్రీ భవానీ శంకర ఆలయంలో కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం సహస్ర దీపాలంకరణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బసిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు. అనంతరం భగవద్గీత పారాయణం, సాయంత్రం 6 గంటలకు ఆనంద కోలాటాల నడుమ అయ్యప్ప స్వామి గ్రామోత్సవం ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరుగుతుంది.

డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావు



జమ్మలమడుగు : జమ్మలమడుగు డీఎస్పీగా వెంకటేశ్వరరావు గురువారం పదవీ బాధ్యత లు చేపట్టారు. ఇటీవల ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ పదోన్నతిపై వెళ్లారు. కొంతకాలం ప్రొద్దుటూరు డీఎస్పీ, ఆ తర్వాత కడప డీఎస్పీ ఇన్‌చార్జిలుగా వ్యవహరించారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శాంతిభద్రతలపై నిఘాపెంచడం జరుగుతుందన్నారు.

కేన్సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెద్దముడియం : కేన్సర్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డివిజన్ జిల్లా ఉప వైద్యాధికారి శాంతకళ తెలిపారు. గురువారం మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో ఎన్‌సీడీ సీడీ 3.0 కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మహిళలకు కాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫీల్డ్ స్టాఫ్ వారంలో ఐదు రోజులు, రోజుకు ఐదు గృహాలను సందర్శించి క్వాలిటీ పరంగా సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి హుస్సేన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ పరిశీలన



షెడ్‌ను పరిశీలిస్తున్న డీపీఓ రాజ్యలక్ష్మి

పెండ్లిమర్రి : మండల కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను గురువారం జిల్లా పంచాయతీ అధికారిని (డీపీఓ) రాజ్యలక్ష్మి పరిశీలించి అనంతరం సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. వర్మీ కంపోస్ట్‌ను తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. వర్మీ కంపోస్ట్ పంటలకు వాడితే పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగమల్లారెడ్డి, గంగిరెడ్డి, పంచాయితీ కార్యదర్శి లక్ష్మిపతి, గ్రీన్ అంబాసిడర్స్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు వినికిడి యంత్రాల పంపిణీ



బధిరులకు వినికిడి యంత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తదితరులు

పులివెందుల టౌన్ : మాజీ సింగిల్ విండో ఈశ్వరయ్య తమ స్వగ్రామమైన వెంకటాపురం గ్రామానికి చెందిన బధిరులకు ఏర్పాటు చేసిన వినికిడి యంత్రాలను ఆయన స్వగృహంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, గౌడ సంఘం నాయకులు కొండయ్యగౌడ్, స్వచ్ఛందసేవకులు మంజుల, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జోనల్ మీట్



జోనల్ పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సీఐ రమణ

లింగాల: మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలోని గురుకుల పాఠశాలలో గురువారం బాలికల జోనల్ పోటీలను ఎంపీపీ రమాదేవి ప్రారంభించారు. సీఐ ఎంవీ రమణ, అనంతపురం డీసీఓ ఉదయశ్రీ, ఎంపీపీ రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాలికలు మనోధైర్యంతో ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఎంఈఓ రామకృష్ణయ్య, ప్రిన్సిపల్ సరస్వతమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో రాయలసీమ పరిధిలోని అన్ని పాఠశాలల పీఈటీలు, ఇప్పట్ల సర్పంచ్ అంకాలమ్మ, ఎస్ఐ మధుసూదనరావ్ పాల్గొన్నారు.

ఘనంగా పవిత్రోత్సవాలు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో పవిత్రోత్సవ హోమాలు వైభవంగా జరుగుతున్నాయి. హోమాలను ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్యఅర్చకులు కేస రి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, వేదపారాయణదారు రామమోహణశర్మతో పాటు వేదపండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య పర్యవేక్షణలో జరిగాయి.

అపార్‌కు ఆధార్ గ్రహణం

- అక్షరం తప్పున్నా నమోదుకు ఆటంకం
- వివరాలు సరిచేస్తేనే ప్రక్రియ వేగవంతం
- ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



అపార్ కార్డు

ఎర్రగుంట్ల : దేశవ్యాప్తంగా విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు జారీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదుకు ఆటంకాలు ఎదరవుతున్నాయి. ఆధార్ కార్డులో ఉన్న సమాచారం మేరకే అపార్ జారీ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు సంబంధించిన వివరాలు ఆధార్‌లో తప్పులతడకగా ఉండటంతో ఆన్‌లైన్‌లో పొందుపరచడానికి సమస్యలు తలెత్తుతున్నాయి. ముందుగా ఆధార్‌లో తప్పులు సరిచేసి ఆ తరువాత ఆపార్‌లో నమోదు చేపటాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఒక్కొక్క పాఠశాలలో 55 శాతం కూడా పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది.

- నూతన విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం వన్‌నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ పేరిట ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు అపార్ జారీ చేయాలని నిర్ణయించింది. ఈ కార్డు ద్వారా విద్యార్థికి సంబంధించిన పూర్తిస్థాయి సమాచారం నమోదై ఉంటుంది. దేశంలో ఎక్కడైనా చదవాలన్నా, ఉపాధి అవకాశాలకు ఈ శాశ్వత డిజిటల్ కార్డు సంఖ్య కీలకం కానుంది. ముఖ్యంగా ధ్రువపత్రాల రక్షణకు అవకాశం ఉంటుంది. అయితే విద్యార్థుల ఆధార్ వివరాల్లోని తప్పులతో అపార్ నమోదకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పేర్లలో తప్పులు... తప్పని ఇబ్బందులు

- ఆధార్ ఒక విధంగా, పాఠశాలలో మరో విధంగా పేర్లు ఉండటంతో వాటిని మార్చడం సమస్యగా మారింది. చాలా మందికి ఆధార్ జారీ సమయంలో పుట్టిన సంవత్సరం మాత్రమే నమోదు చేశారు. నెల, తేదీ నమోదు చేయకపోవడంతో ఇబ్బందులు నెలకున్నాయి. పాఠశాల, ఆధార్‌లోని వివరాలు సరి పోలినప్పుడే అపార్‌లో నమోదు అవుతుంది. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, మొబైల్ నంబర్, తల్లిదండ్రులు పేర్లు, ఆధార్ సంఖ్యలో ఏదైనా తప్పుగా చూపినా నమోదు కావడడం లేదు. పేరులో సైతం అక్షరాలు సక్రమంగా ఉంటేనే ఆన్‌లైన్‌లో నమోదుకు ముందుకెళ్లడానికి అవకాశం ఉంటుంది. పాఠశాల రికార్డులో నమోదైన సమాచారానికి ఆధార్ వివరాలకు పొంతన లేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పుట్టిన తేదీ, పేర్లు, మొబైల్ నంబర్ పరంగా ఎక్కువగా తప్పులు దొర్లుతున్నాయి. చిరునామా సరిపోవకపోడంతో ప్రక్రియ సజావుగా సాగడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ వివరాలు సరిచేయడానికి సరైన సమాచారం ఇవ్వకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఆధార్ నమోదుకు వచ్చిన విద్యార్థులు తల్లిదండ్రులు

కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు...

ఆధార్‌లో పుట్టిన తేదీ, సమస్య పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శి ఇచ్చే ధృవీకరణ పత్రం కీలకం. గ్రామాల్లో 80 శాతం జనన వివరాలు పంచాయతీ కార్యాలయాల్లో నమోదు చేయించడం లేదు. రెవెన్యూ శాఖ జనన ధృవీకరణ పత్రాలు జారీ చేస్తేనే అపార్‌లో నమోదుకు అవకాశం ఉంటుంది. అయితే ఈ పక్రియను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం అపార్ కార్డు తప్పనిసరి కావడంతో ఆధార్‌లో తప్పులు సరిచేసుకునేందుకు విద్యార్థుల తల్లిదుండ్రులు అధికారులు, ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరస్థితి నెలకొంది. మరోవైపు ఆధార్ సమస్యతో అపార్ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పిల్లల పేర్లు తప్పుగా నమోదయ్యాయి



మా అబ్బాయి పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. అయితే స్కూల్‌లో ఒకలా ఆధార్‌కార్డులో మరోలా పేరు ఉండటంతో సరిచేయించుకోవడానికి ఆధార్ కేంద్రానికి వచ్చాం. త్వరగా పూర్తియితే బాగుంటుంది. పనులను మానుకోని తిరుగుతున్నాం

– సాల్మన్, ఎర్రగుంట్ల.

వేగవంతంగా అపార్ నమోదు



కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు ప్రక్రియ ఆయా పాఠశాల్లో వేగవంతంగా జరుగుతోంది. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు కలపి 80 పాఠశాలు ఉన్నాయి. వీటిలో సుమారు 10 వేల మంది దాక చదువుతున్నారు. అపార్ నమోదు జిల్లాలో మూడవ స్థానంలో ఎర్రగుంట్ల ఉంది. అపార్ కార్డు జారీలో కొన్ని అవంతరాలు ఏర్పడినా సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శివప్రసాద్, ఎంఈఓ, ఎర్రగుంట్ల.

నేడు కార్తిక పౌర్ణమి వేడుకలు

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లెలోని శివకృష్ణ గోశాల, పాలగిరి క్రాస్ వద్ద వెలసిన కాశిరెడ్డి నాయన, సాయిబాబా, సర్వరాయ ప్రాజెక్టు వద్ద వెలసిన మునీశ్వర దేవస్థానాలలో శుక్రవారం కార్తిక పౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనిమెల సంగమేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు జ్వాలా తోరణ కార్యక్రమం, ఆలయం చుట్టూ పార్వతీ దేవి, సంగమేశ్వరుని ఉత్సవం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు సుబ్రమణ్య శర్మ తెలిపారు.

కంప్యూటర్ విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



కంప్యూటర్ గదిని ప్రారంభిస్తున్న శ్రీవాణి కిషోర్‌కుమార్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : ప్రతి విద్యార్థి కంప్యూటర్ విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కడప రీజనల్ మేనేజర్ శ్రీవాణి కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గంగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం నాలుగు కంప్యూటర్లు, ప్రింటర్స్, 20 డెస్కులు, 4 రివాల్వింగ్ చైర్స్, 6 కుర్చీలు, 6 టీచర్స్ డెస్కులను ఆయన అందజేశారు. తమ పాఠశాలకు రూ.4 లక్షలు విలువగల సామగ్రిని అందిజేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం కంప్యూటర్ గదిని శ్రీవాణి కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

లింగాల : స్థానిక శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి గ్రంథాలయ అధికారి పద్మావతి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో గ్రంథాలయ వారోత్సవాల ప్రతిజ్ఞను చేయించారు.

వేంపలిలో..

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నెహ్రూ చిత్రపటానికి గ్రంథాలయ అధికారి వనజ నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాలనుంచి గ్రంథాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వారం రోజులు గ్రంథాలయంలో వివిధ రకాల పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం సర్పంచు రామాంజనమ్మ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం నెహ్రూ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. వారోత్సవాలలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు. గ్రంథాలయ అధికారి గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేంపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు

జమ్మలమడుగు రూరల్ : నేడు ప్రపంచంలో అన్ని రంగాల్లో పోటీతత్వం ఉందని బాగా చదువుకున్న వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.బార్గవి తెలిపారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మహత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో విద్యార్థులకు ఆమె న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలన్నారు. విద్యార్థులు చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జిభార్గవి

విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమే

చక్రాయపేట : విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని కర్నూలు గురుకుల పాఠశాలల సమన్వయకర్త డాక్టర్ ఐ.శ్రీదేవి పేర్కొన్నారు. జోన్–4 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు గురువారం మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గండి గురుకుల పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమెతో పాటు చిత్తూరు గురుకుల పాఠశాలల సమన్వయ కర్త టి.పద్మజ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువు సంస్కారాన్ని ఇస్తే క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఇంటర్ విద్య ఇన్‌చార్జి ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య, జిల్లా మాజీ స్పోర్ట్స్ అధికారి రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ సురేంద్రబాబు, జోన్–4 క్రీడల సమన్వయకర్త నీలకంఠేశ్వరరావు, ఆర్గనైజర్ వైకే ఎల్లారెడ్డి, ఎంపీటీసీ శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న శ్రీదేవి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముద్దనూరు : ముద్దనూరు–జమ్మలమడుగు ప్రధాన జాతీయ రహదారిలో గురువారం ప్రమాదవశాత్తు ట్రాక్టరు ద్విచక్ర వాహనం ఢీకొని ఇరువురికి తీవ్ర గాయాలు అయిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు కొండాపురం మండలం ఓపన్నపేట గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి, బాబు ఇరువురు ద్విచక్ర వాహనంపై జమ్మలమడుగు వైపు వెళుతుండగా వైయస్సార్ కాలనీ సమీపంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో సురేందర్‌రెడ్డికి కుడి చేయి విరిగి తలకు గాయాలైనట్లు తెలిపారు. 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నిందితుల అరెస్ట్

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని పెద్దండ్లూర్ గ్రామంలో పొలం తగదా విషయంలో గత నెల 30వ తేదీ దాడులు చేసుకున్న సంఘటనలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు పట్టణ సీఐ ఎస్.లింగప్ప తెలిపారు. సీఐ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 30వ తేదీ పొలం తగదా విషయంలో పెద్దండ్లూర్ గ్రామానికి చెందిన తలారి పవన్‌కుమార్, తలారి రాంమోహన్‌లు మరి కొంత మంది అదే గ్రామానికి చెందిన యెర్వ హనుమంత్‌రెడ్డి, యెర్వ రామనాథ్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డిలపై వేట కోడవళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని గురువారం వారిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పరామర్శ

వీరపునాయునిపల్లె : మండలంలోని ఇందుకూరు సర్పంచ్ కుమారుడు వెంకటేష్ యాదవ్, ఉరుటూరు సర్పంచ్ భర్త శ్రీరంగడు ఇటీవల జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజుల్‌రెడ్డి గురువారం వారిని పరామర్శించారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మొయిళ్లచెరువు సర్పంచ్ వెంకటరెడ్డి, నాయకులు ఆయన వెంట ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

కమలాపురం : ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలంటే ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డీఎల్‌పీఓ విజయభాస్కర్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాలు అభివృద్ధి చెందుతాయన్నారు. పంచాయతీలకు వచ్చే నిధులను సక్రమంగా వెచ్చించి గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, అధికారులతో కలసి సమన్వయం చేసుకుని అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించకుండా తాగు నీరు, పారిశుద్ధ్యం మెరుగు పరచడంతో పాటు అన్ని పనులు ప్రాధాన్యత క్రమంలో సక్రమంగా జరిగేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయంతో పని చేయాలన్నారు. ఎంపీడీఓ జ్యోతి మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికలతో గ్రామాల అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఇందులో కార్యదర్శులు, డిజటల్ అసిస్టెంట్ల పాత్ర ఎక్కువగా ఉంటుందన్నారు. మాస్టర్ ట్రైనర్లు శివారెడ్డి, నాగమణిలు అభివృద్ధి పనులు చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. ఈఓపీ ఆర్‌డీ కెజియా, టీడీ రోషినా, వెలుగు ఏపీఎం గంగాధర్, హౌసింగ్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, ఎంఈఓలు బేబి, సుభాషిణి ఇతర అధికారులు పాల్గొన్నారు.



కమలాపురంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ విజయభాస్కర్

శిక్షణ కార్యక్రమాలను సద్వినియెగం చేసుకోండి

సింహాద్రిపురం : మండల సభాభవనంలో గురువారం అధికారులకు, ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ కృష్ణమూర్తి నిర్వహించి మాట్లాడారు. శిక్షణ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ సహాయ సంఘ లీడర్లు, జెడ్‌పీటీసీ ఝాన్సీరాణీ, ఎంపీపీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

ఎర్రగుంట్ల : మండలంలోని గ్రామ పంచాయతీలలో అభివృద్ధి ప్లానింగ్‌పై అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీపీఆర్‌సీ రిసోర్స్ పర్సన్ దేవేంద్రరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జీపీడీపీలపై ప్రణాళిక తయారిపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఉపమండలాధ్యక్షుడు మల్లు మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు, ఈఓపీఆర్డీ రంతుల్లయ్య, ఏఓ త్రిమూర్తిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రుపొదించుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ప్రణాళికలు రుపొందించుకోవాలని జమ్మలమడుగు డీఎల్‌డీఓ సుబ్రమణ్యం తెలిపారు. గురువారం మైలవరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై మండల అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని మండల ఎంపీడీఓ వై.రామచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళకలు ఏ విధంగా చేయాలి అనే అంశంపై సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు పూర్తిగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, డివిజనల్ పంచాయతీ అధికారి తిమ్మక్క, సచివాలయ డిజిటల్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే అభివృద్ధి పనులు

ముద్దనూరు : గ్రామాల్లో ప్రణాళికలు సిద్ధం చేసుకుని అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎంపీడీవో ముకుందరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీలకు, సర్పంచ్ లకు, సచివాలయ సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గాంధీ జీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నెలకొల్పడానికి ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు అభివద్ధిలో కీలక పాత్ర అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ టీసీ సభ్యురాలు ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన

ముద్దనూరు : 108 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ వరదకిషోర్‌రెడ్డి, ఎంపీడీవో ముకుందారెడ్డికి గురువారం వారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 108ను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 25వ తేదీన సమ్మెబాట పడదామని 108 సిబ్బంది తెలిపారు.

నేడు కార్తిక వనభోజనం

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : మండలంలోని గంగమ్మ ఆలయ ఆవరణ సమీపంలో వెలసిన శివాలయంలో శుక్రవారం కార్తిక వన భోజనాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

పులివెందుల టౌన్ : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు రసూల్ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్ రాజారెడ్డి భవన్ పాత ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు విచ్చలవిడిగా అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. వాటిని నెరవేర్చలేక వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదాన్ని తెరపైకి తీసుకువచ్చారు. అలాగే విజయవాడలో వరద బాధితులను ఆదుకోవడంలో విఫలమయ్యారు. కూటమి ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని చేస్తున్న చర్యలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఖండిస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని హితవు పలికారు. మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ సర్వోత్తమ్‌రెడ్డి, వైఎస్సార్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక వాహనాలు సీజ్

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని గూడెంచెరువు గ్రామం నుంచి అక్రమంగా ఇతర జిల్లాలకు తరలిస్తున్న రెండు టిప్పర్లు, రెండు లారీలను పట్టుకుని సీజ్ చేసినట్లు పట్టణ ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపారు.

ఎస్ఐ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి ఎస్ఐ తన సిబ్బందితో కలసి గూడెంచెరువు గ్రామానికి వెల్తుండగా పెన్నానది సమీపానికి వెళ్లగానే ఎదురుగా 2 టిప్పర్లు, 2 లారీలు వచ్చాయి. అయితే డ్రైవర్ల వద్ద ఎటువంటి పత్రాలు లేకుండా ఇతర జిల్లాలకు ఇసుకను తరలిస్తున్నట్లు తెలియడంతో వాహనాలను అదుపులోకి తీసుకుని సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవాలి



కమలాపురంలో నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం కృష్ణవేణి, విద్యార్థులు



వేంపల్లె : నృత్యాలు చేస్తున్న చిన్నారులు



పులివెందులలో జేఎన్‌టీయూ కళాశాలలో నెహ్రు చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్



ఎర్రగుంట్లలో నెహ్రు చిత్రపటానికి నివాళుల అర్పిస్తున్న కమిషనర్ శేషఫణి

కమలాపురం : విద్యార్థులు పుస్తక పఠనం అలవరచుకుని తద్వారా విజ్ఞానం పెంపొందించు కోవాలని ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం కృష్ణవేణి తెలిపారు. కమలాపురం శాఖా గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక గ్రంథాల యాధికారిణి ఎస్.నాగాంజలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో కలసి నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య కృషి వలన మనకు గ్రంథాలయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. విద్యార్థులందరూ పుస్తక పఠనం అలవరచుకుని తద్వార విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : స్థానిక గ్రంథాలయంలో గురువారం నెహ్రూ జయంతి వేడుకలను గ్రంథాలయ అధికారి శేఖర్ ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజు విద్యార్థులకు పుస్తకాలు చదవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం చిన్న పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండలంలోని పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతంర నెహ్రు చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శేషమహేశ్వరమ్మ, డిప్యూటీ కంట్రోలర్ సాంబయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే అంబకపల్లె రోడ్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ శ్రీలత ఆధ్వర్యంలో నెహ్రు చిత్ర పటానికి నివాళులు అర్పించారు. స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో బాలల దినోత్సవం, స్పోర్ట్స్ డేని ఘనంగా నిర్వహించారు. రూరల్ సీఐ రమణ నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : స్థానిక గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవం కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషఫణి నెహ్రు చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ ఉమాదేవి పాల్గొన్నారు. అలాగే మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరిగాయి. జువారి డీఏవీ స్కూల్‌లో ఫ్యాక్టరీ ప్రతినిధులు పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు.